క్లుప్తంగా

ఘనంగా నందీశ్వరుని తిరువీధి



తిరువీధిలో ఊరేగుతున్న పార్వతీపరమేశ్వర సహిత నందీశ్వరుడు

పాలకొండ రూరల్: స్థానిక మేదర వీధిలో కొలువుతీరిన పార్వతీపరమేశ్వర సహిత నందీశ్వరుని తిరువీధి ఉత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో స్వామివారికి విశేష పూజలు, సామూహిక వ్రతాలు నిర్వహించిన భక్తులు సాంప్రదాయబద్ధంగా నిమజ్జనోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోలీసుల అదుపులో నిందితులు



పోలీసుల అదుపులో నిందితులు

పాలకొండ రూరల్: ఇటీవల పాలకొండ మండలం వెలగవాడ సమీపంలో ఇండికా కారులో 160 లీటర్ల సారాను తరలించే క్రమంలో పోలీసులను చూసి కారును వదిలి పారిపోయిన ఘటన విధితమే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. సీతంపేట మండలం మండ గ్రామానికి చెందిన ఎస్.మంగయ్య, శ్రీకాంత్‌తో పాటు ఇదే గ్రామానికి చెందిన ఎస్.యాకోబు సారా రవాణాకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం



మందుగుండు నిల్వలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొమరాడ: మండలంలోని గుణానపురం గ్రామంల్లో పొట్నూరు సతీష్ ఇంట్లో రూ.40 వేలు విలువ చేసే మందుగుండు సామగ్రిని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు కొమరాడ హెచ్‌సీ రాజరత్నం తెలిపారు. ఎస్‌ఐ జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో దాడులు చేసి అక్రమంగా నిల్వ చేసిన మందుగుండును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి సర్వేశ్వరరావు

వీరఘట్టం: అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి సర్వేశ్వరరావు వివరించారు. స్థానిక గాయిత్రీ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్రిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు వినియోగించే పరికరాలను ఏవిధంగా వినియోగిస్తారో డెమో ద్వారా వివరించారు.

పథకాలను పక్కాగా అమలు చేయాలి

సీతంపేట: స్థానిక మండల మహిళా సమాఖ్యలో బుధవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గీతాంజలి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పకడ్బందీగా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో పోషణప్లస్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందివ్వాలన్నారు. రక్తహీనత గల చిన్నారులను స్థానిక ఎన్‌ఆర్‌సీలో చేర్పించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వైకేపీ ఏపీఎం విజయకుమారి, సీడీపీవో రంగలక్ష్మి, కుశిమి పీహెచ్‌సీ వైద్యాధికారి రవీంద్ర పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలియజేశారు. బగ్గందొరవలసలో సర్పంచ్ ఎ.నారాయణరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివారావు కూలీలతో చేయిస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే సీఎం జగన్ మోహన్‌రెడ్డి త్రికరణ శుద్ధితో అమలు చేశారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని లివిరి గ్రామంలో సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, సర్పంచ్ బౌరి సొధామిని, ఎంపీటీసీ పొట్నూరు ఉష ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొని గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అంతకుముందు గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ పాలక ఉషారాణి, సర్పంచ్‌లు భార్గవనాయుడు, ఎం.కేశవ, తోగరాన శ్రీను, మాజీ సర్పంచ్ చెప్పల రాములు, మాజీ జెడ్పీటీసీ ఎస్.గోపాలరావు, బౌరి త్రినాథ్, బొడ్డేపల్లి ప్రసాద్, లివిరి, బైరికాలనీ, అనంతగిరి, గజపతినగరం, తదితర గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర వెల్‌నెస్ కేంద్రంలో నిర్వహిస్తున్న టీకా కార్యాక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులైన పిల్లలు, గర్భిణులు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి టీకాలు వేశారు, గడువు తేదీలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ముందురోజునే వ్యాక్సినేషన్‌పై సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలకు వయసును బట్టి అందించే టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ కారణం చేతనైనా టీకాలు వేసుకోని చిన్నారులు ఉంటే గుర్తించి వెంటనే టీకాలు వేయించాలని సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి సేవాసదన్ జిల్లా సమన్వయకర్త

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామంలోని చాకలివీధిలో ఎస్ఫూర్తి సేవాసధన్ సభ్యులు వ్యక్తిగత పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్యంపై జిల్లా సమన్వయకర్త ఎం.భీష్మ ప్రజలకు అవగాహన కలిప్ంచారు. బీపీ, సుగర్, రక్తహీనత, చర్మ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోగాలు ప్రబల కుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డి.రాము, ఎం.సురేష్, మండంగి ప్రసాద్, మీసాల మురళి, సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: డిసెంబర్ 11 నుంచి 2024 జనవరి 15 వరకు ప్రభుత్వం నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల నిర్వహణకు పీడీలు, పీఈటీలు, కార్యదర్శులు సిద్ధం కావాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. గ్రామ సచివాలయం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల నిర్వహణకు అనువైన మైదానాలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్సై షణ్ముఖరావు, ఎంఈఓ బి.చంద్రోఖర్ ఉన్నారు.

ఎండిన వరి పంట పరిశీలన



గుచ్చిమిలో ఎండిన వరిచేనును పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో ఎండిపోయిన వరిపంటను ఏఓ ఎస్.అవినాష్, ఇతర శాఖల అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ అవినాష్ మాట్లాడుతూ వర్షాలు కురవక పోవడం వలన గుచ్చిమి ,చిన్నారాయుడుపేట, సీతారాంపురం గ్రామాల్లో ఎండి పోయిన వరిచేను పంటల నష్టాల్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వరిచేలు కోతకు సిద్ధం కావడంతో పంటల దిగుబడిపై పంట కోత ప్రయోగాలు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని లివిరిలో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఎంపీయూపీ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. బోధనలో ఆధునిక పద్ధతులు అమలు చేస్తున్నారని, బైజూస్ బోధనతో విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ బౌరి సొధామిని, ఎంపీటీసీ పొట్నూరు ఉష, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావులు ఉన్నారు.

సంక్షేమ పథకాల వివరాలు వేలాడదీయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన వివరాలను సచివాలయాల్లో అందరికీ తెలిసేలా బోర్డులు విధిగా వేలాడదీయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలి సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి వారికి చేరాయా? లేదా? అనే అంశంపై గ్రామవలంటీర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికీ ఏదో రూపంలో సంక్షేమ పథకం అమలు చేసినప్పటికీ ఏవిధంగా పథకాలు వర్తించాయో లబ్ధిదారులకు తెలియ జేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందడానికి ఎవరైనా అర్హులుంటే వారు ఏవిధంగా ప్రభుత్వ సహాయం పొందవచ్చునో తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమావర్మ, సర్పంచ్ కె.రాధ, కార్యదర్శి మనోహర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు



జియ్యమ్మవలస: పెదబుడ్డిడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న గౌరీశంకరరావు

జియ్యమ్మవలస/సీతంపేట: జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సీతంపేట సచివాలయం-2లో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీఓ కె.గీతాంజలి పర్యవేక్షించారు.

ప్రీస్కూల్ సక్రమంగా నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్.సుశీలాదేవి అన్నారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో భాగమైన అన్ని రకాల రికార్డులు, యాప్‌లను సక్రమంగా నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన పోషకాహార కిట్లు సకాలంలో అందజేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, ఉనీష తదితరులున్నారు.

రైతులకు రాయితీపై స్ప్రేయర్లు అందజేత



రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు అందజేస్తున్న ఎంపీపీ

వీరఘట్టం: రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఎం.పీ.పీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉద్యానవనశాఖ, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 7 మంది రైతులకు రూ.8 వేల సబ్సీడీపై రూ.20 వేల విలువ గల పవర్ స్ప్రేయర్లను అందజేశారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ డివిజినల్ అధికారి అమరేశ్వరి, ఏపీఎం శివున్నాయుడు, సీసీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఏపీవో రోసిరెడ్డి

సీతంపేట: గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి అన్నారు. దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. తరగతికి వెళ్లి విద్యార్థుల చదువులను పరిశీలించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

సేంద్రియ పంటలతో ఆదాయం, ఆరోగ్యం

- నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున



రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున

గుమ్మలక్ష్మీపురం: రైతులు ఏడాది పొడవునా ఆదాయం పొందేలా పంటలు సాగు చేయాలని నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున అన్నారు. మండలంలోని పెంగర, రాయగడ జమ్ము గ్రామాల్లో జట్టు సంస్థ పర్యవేక్షణలో అమలు చేస్తున్న 'మాతోట-జీవ' ప్రాజెక్టులో భాగంగా పండ్ల తోటల్లో అంతర పంటల సాగును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. విత్తనాల కోసం రైతులు మరొకరిపై ఆధారపడకుండా వారే స్వయంగా తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, ఎగ్జిక్యూటివ్ ఎస్.ప్రహరాజ్, ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ పంటలతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: పూర్వీకులు పండించిన సాంప్రదాయ పంటలతోనే మనిషికి ఆరోగ్యం సిద్ధిస్తుందని శతాధిక వృద్ధుడు రొక్కం సత్యనారాయణ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని పంటలసాగులో తన కున్న అనుభవాన్ని అక్కడి వారితో పంచుకున్నారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు, తదితరులు

అనంతరం వర్క్‌షాపులో పాల్గొన్న రచయితలు, ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

గుమ్మలక్ష్మీపురం/వీరఘట్టం/పాలకొండ: గడిచిన నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు తెలియజేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎంగా ఎందుకు కావాలో వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో అన్ని మండలాల్లో ఎంపిక చేసిన సచివాలయాల పరిధిలో ఈ నెల 9 నుంచి 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇంతవరకు జరిగిన అభివృద్ధిని ప్రతీ సచివాలయం పరిధిలో డిజిటల్ బోర్డుల ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు గతంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించనున్నారు.

కార్యక్రమం షెడ్యూల్

పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం, పాలకొండ మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు. వీరఘట్టం మండలంలో ఈ నెల 9న వీరఘట్టం-1, 10న వీరఘట్టం-2, 14న వీరఘట్టం-3, 15న వీరఘట్టం-4, 16న నడుకూరు, 17న చలివేంద్రి, 20న రేగులపాడు, 21న నడిమికెల్ల, 22న దశమంతుపురం, 23న తూడి సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే పాలకొండ మండలంలో ఈ నెల 9న కొండాపురం, 10న సింగన్నవలస, 14న వెలగవాడ, 15న గోపాలపురం, 16న అంపిలి, 17న తుమరాడ, 20న లుంబూరు, 21న చిన మంగళాపురం, 22న గొట్ట మంగళాపురం, 23న అర్దలి సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నారు.

నిబంధనలు పాటించాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. గరుగుబిల్లి పోలీసు స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో స్వాధీనం చేసుకున్న 291 మద్యం సీసాలను, 14 బీరు సీసాలను, 74.6లీటర్ల సారాను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేసిన, విక్రయించిన చర్యలు తప్పవన్నారు. బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. దీపావళి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకునేలా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలన్నారు. బాణసంచాను బస్సుల్లో, రైళ్లలో తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎం.రాజేష్, సీసీ వి.రాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు



పాలకొండ: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాలకొండ, పాలకొండ రూరల్:

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం కోరుతూ ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షులు డి.పండు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి వెయ్యి రోజులు పూర్తయిన నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తెలియజేసేలా ఈ బంద్ చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు.

- కురుపాం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని ఎస్ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆరిక రాజు అన్నారు. విద్యార్థులతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కురుపాం బస్టాండ్ కూడలి నుంచి మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరారు.



కురుపాం: ర్యాలీలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు